పుస్తకాల పండగ చేసుకుందామా..

- రేపటి నుంచి 57వ గ్రంథాలయ వారోత్సవాలు
- వారం రోజుల పాటు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహణ
- ఎన్నికల కోడ్‌తో హాజరుకాని ప్రజా ప్రతినిధులు


గాంధీనగర్ గ్రంథాలయంలో 'చదువంటే మాకిష్టం' కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నవంబర్‌లో నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలకు గ్రంథాలయాలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఆదేశాల మేరకు అన్ని గ్రంథాలయాల్లో వారం రోజుల పాటు గురువారం నుంచి నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఉభయ గోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు లేకుండా కేవలం అధికారులతో నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను ఆకట్టుకునేలా వివిధ అంశాలపై పోటీలు నిర్వహించాలని మార్గదర్శకాలు జారీ అయ్యాయి. సమీప గ్రంథాలయాలకు దగ్గరలో ఉన్న పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొనేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉన్నత అధికారులు సూచించారు. రోటరీ, లయన్స్, స్వచ్ఛంద సేవా సంస్థలు, జన విజ్ఞాన వేదిక సేవలకు అవకాశం కల్పించారు. కాకినాడ మెయిన్ రోడ్‌లో ప్రధాన గ్రంథాలయంలో పాటు జగన్నాథపురం, గాంధీనగర్, శ్రీనగర్ ప్రాంతాలలో ఉప గ్రంథాలయాలు ఉన్నాయి.

షెడ్యూల్ ఇదే...

- 14వ తేదీన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలతో పాటు నెహ్రూ జయంతి వేడుకల నిర్వహణ
- 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యత.
- 16న గ్రంథాలయ ఉద్యమకారులు ఆర్‌ఎస్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణ వంటి ప్రముఖుల విశేషాల వివరణ.
- 17న రచయితల సందేశాలు, సెమినార్లు, కవి సమ్మేళనాలు,
- 18న విద్యార్థులకు వక్తృత్వం, డ్రాయింగ్, వ్యాస రచన, క్విజ్, క్రీడల పోటీలు, (ముఖ్యంగా గ్రంథాలయాల పాత్ర, నిర్వహణ, ఉపయోగాలు)
- 19న మహిళా దినోత్సవం, దిశ చట్టం, మహిళా సాధికారితపై చర్చ,
- 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన,
- 'చదువంటే మాకిష్టం' ప్రాధాన్యత, విజేతలు బహుమతుల ప్రదానం, జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు.

సద్వినియోగం చేసుకోవాలి



ఏటా లాగే ఈ ఏడాది గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేయాలి. విద్యార్థులు, పాఠకులు, విద్యావేత్తలు ఇలా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకూ అందరికీ సమాచారం పంపిచాం. వారోత్సవాల్లో భాగంగా దాతలు వస్తు రూపేణా సహకారం చేయాలి తప్ప, నగదు రూపంలో చేయకూడదు. – వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

కరప శాఖా గ్రంథాలయంలో..

కరప: మండలంలో వేళంగి శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 57వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు గ్రంథాలయాధికారి పాట్నీడి వెంకటరంగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కరప శాఖా గ్రంథాలయంలో కూడా వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు రికార్డు అసిస్టెంట్ ఎన్‌వీఎస్ ఫణీంద్రకుమార్ తెలిపారు.

క్లుప్తంగా

సిప్ అబాకస్‌లో శశాంక్ ప్రతిభ


కోల్‌కతాలో బహుమతి అందుకుంటున్న శశాంక్

కరప: కోల్‌కతాలో జరిగిన అంతర్జాతీయ సిప్ అబాకస్ పోటీలలో స్థానిక విద్యార్థి బూరెల సత్యశశాంక్ తృతీయ స్థానం దక్కించుకున్నాడు. ఈనెల పదో తేదీన జరిగిన ఈ పోటీలలో వివిధ దేశాలకు చెందిన 6 వేల మంది విద్యార్థులు పాల్గొనగా కాకినాడలోని యోగానంద్ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న శశాంక్ ఈ ఘనత సాధించినట్టు అతని తండ్రి బూరెల వెంకటరమణ మంగళవారం తెలిపారు. కాకినాడ సిప్ అబాకస్ సెంటర్ అధినేత దారా శ్రీరామ్ ఆధ్వర్యంలో ఆ పోటీల్లో పాల్గొన్నాడు.

పార్వతీదేవికి పంచామృతాభిషేకం


రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో పార్వతీదేవికి కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

కాకినాడ రూరల్: కార్తిక ఏకాదశి సందర్భంగా రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని దుర్గా వెంకట శివసాయి అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ సమేత త్ర్యయంబకేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న స్కూటరిస్ట్ జక్కపు వీరబాబు, గుర్తు తెలియని వ్యక్తి

కరప: నడకుదురు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ నుంచి కోటిపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కరప మండలం నడకుదురు వద్దకు వచ్చేసరికి మద్యం తాగిన వ్యక్తి అడ్డు రావడంతో అతనిని తప్పించబోయి ఎదురుగా పెనుగుదురు వైపు నుంచి కాకినాడ వెళ్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న జక్కపు వీరబాబు, మద్యం తాగి అడ్డు వచ్చిన వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.100 కోట్ల భూ దోపిడీ అవాస్తవం

- వాస్తవాలు పరిశీలించండి
- కలెక్టర్‌కు సత్తి గోపాలరెడ్డి వినతి

కాకినాడ: ద్వారంపూడి కుటుంబం రూ.100 కోట్ల భూమి దోపిడీ చేసిందంటూ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని భూమి యజమాని సత్తి గోపాలరెడ్డి స్పష్టం చేశారు. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చేసిన ఆరోపణలపై వాస్తవాన్ని తెలియజేస్తూ అందుకు సంబంధించిన రికార్డులను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను పత్రికలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపాలరెడ్డి మాట్లాడుతూ రాగంపేట ప్రాంతంలోని తన రెండు ఎకరాల ఐదు సెంట్ల స్థలానికి బదులుగా శ్రీ విద్యకాలనీలో స్థల మార్పిడి ద్వారా తనకు ఇచ్చారన్నారు. అందుకు సంబంధించి సదరు స్థలంతో పాటు మరో 66 సెంట్ల స్థలాన్ని కూడా ప్రభుత్వానికి ఇచ్చామన్నారు. శ్రీ విద్యకాలనీలోని స్థలాన్ని ఇరిగేషన్ కెనాల్‌గా ఆరోపిస్తున్నారని, అయితే వాస్తవానికి 2005 లోనే రికార్డులలో రెవెన్యూ స్థలంగా నిర్ధారించారని, తమకు 2008లో స్థల మార్పిడి చేశారని, అందుకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రక్రియలన్నీ పూర్తి చేశామన్నారు. వాస్తవాలను పక్కన పెట్టి దాదాపు 16 ఏళ్ల తరువాత రూ.100 కోట్ల భూ దోపిడీ అంటూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యంగా ఈ అంశంపై ఎలాంటి సంబంధం లేని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని వివాదంలోకి లాగి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ వాస్తవాలను పరిశీలించాలని కోరారు. ఆ మేరకు అందుబాటులో ఉన్న అప్పటి ప్రభుత్వ ఉత్తర్వులు, భూమి స్వాధీన రికార్డులను ఆయన అందజేశారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్తు నాశనం

- డీఎస్పీ విష్ణు రఘువీర్
- ఆర్‌ఎంసీ ఆడిటోరియంలో అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్


కాకినాడ క్రైం: ర్యాగింగ్‌తో విద్యార్థి భవిత నాశనం అవుతుందని డీఎస్పీ విష్ణు రఘువీర్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌ఎంసీ ఆడిటోరియంలో కళాశాల యాజమాన్యం, యాంటీ ర్యాగింగ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో డాక్టర్ శశి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయవాది కౌశిక్ నాయుడు, డీఎస్పీ రఘువీర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడిన వారిదే కాక, బాధితుల భవిష్యత్ సైతం పాడవుతాయని అన్నారు. ర్యాగింగ్ చేసిన విద్యార్థి చట్టపరమైన చర్యలతో పాటు కళాశాల తీసుకునే చర్యలు ఎదుర్కొంటే, ర్యాగింగ్ బాధితులు మనోవేదనకు గురై వారి మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ర్యాగింగ్ తీవ్రతను అనుసరించి నాన్ బెయిలబుల్ సెక్షన్లతో కూడిన శిక్షలు ఉన్నాయని డీఎస్పీ అన్నారు. కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సారథులు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ యశోదమ్మ, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రస్తుత జూనియర్లు భవిష్యత్ సీనియర్లు కాబోతున్నారని, ర్యాగింగ్ మిగిల్చిన చేదు గాయాలపై అవగాహన కలిగి తమ జూనియర్లను ర్యాగింగ్ చేయకుండా బాధ్యతాయుతంగా మసలుకోవాలని హితవు పలికారు.

అపార్ నమోదు వేగవంతం చేయండి


అపార్ ఐడీ నమోదుపై మాట్లాడుతున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: ఒక విద్యార్థి–ఒక దేశం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యూడైస్ ప్లస్ విధానంలో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని, విద్యార్థుల సర్వే అపార్ ఐడీ నమోదును వేగవంతం చేయాలని కమిషనర్ భావన ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులందరికీ తప్పనిసరిగా అపార్ ఐడీ ఉండాలన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తోందన్నారు. ఈ క్రమంలోనే విద్యార్థుల విద్యార్హత, విద్యపై సమగ్ర వివరాలను సేకరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్‌లోనే వివరాలు నిక్షిప్తం చేయాలన్నారు. శుక్రవారం నాటికి కాకినాడ అర్బన్ పరిధిలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల అపార్ ఐడీని నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చేపట్టిన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, కాకినాడ అర్బన్ మండల 1, 2 విద్యాశాఖ అధికారులు ఏఎస్‌కేవీ ప్రేమజ్యోతి, సీహెచ్ రవి, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డీవీఈవో ఆర్.నూకరాజుతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వేడుకగా వెంకన్నబాబు సంబరం


విశిష్ట అలంకరణలో పెనుగుదురులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి

కరప: మండలం పెనుగుదురు గ్రామంలో మంగళవారం వెంకన్నబాబు సంబరాన్ని నిర్వహించారు. యేటా కార్తిక శుద్ధ ఏకాదశి రోజున స్వామివారికి కళ్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం వీధుల్లో ఆర్కెస్ట్రా, తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో రాత్రి తెల్లవార్లు సంబరం నిర్వహించారు. ముందుగా ఆలయంలోని శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి వార్లను అలంకరించి, పూజలు చేసి కల్యాణం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, సర్పంచ్ రెడ్డిపల్లి వెంకట మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు బండారు సుజాత తదితరులు పాల్గొన్నారు.

వేళంగిలో పెద్ద ఏనుగుల సంబరం

వేళంగి గ్రామంలో మంగళవారం రాత్రి రెండు వీధులకు సంబంధించిన పెద్ద ఏనుగుల సంబరం నిర్వహించారు. మార్ని, మెర్ల వంశీయులు ఏటా ఈ సంబరాన్ని నిర్వహిస్తారు. రెండు వీధులవారి ఏనుగు బొమ్మలను విద్యుద్దీపాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో రాత్రి తెల్లవార్లూ ఊరేగించారు.

మహావిష్ణువుగా సీతారామస్వామి


మహావిష్ణువు అలంకరణలో దర్శనమిచ్చిన సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు మంగళవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి మహావిష్ణు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. క్షీరాబ్ధి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోరమాండల్ ఆధ్వర్యంలో వన సమారాధన


మహిళలకు కుట్టుమెషీన్లు అందజేస్తున్న యూనిట్ హెడ్ శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ప్రాంగణంలో కోరమండల్ ఎరువుల కర్మాగారం ఆధ్వర్యంలో మంగళవారం వన సమారాధన నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో సందడి చేశారు. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు మెషీన్లు, అంగన్‌వాడీ సెంటర్లకు సీలింగ్ ఫ్యాన్లు, బాలుడి వైద్యం నిమిత్తం రూ.15 వేలను యూనిట్ హెడ్ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ పద్మనాభం, కోరమాండల్ మహిళా క్లబ్ అధ్యక్షురాలు దుర్గావతి, కార్యదర్శి మల్లీశ్వరి, కోశాధికారి శ్రీదేవి, సభ్యులు లక్ష్మి సృజన, మోహిని కుమారి, లక్ష్మిప్రభ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

నీట్ మెటీరియల్ అందజేత

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పైడా వెంకటనారాయణ సేవాసంస్థ ద్వారా నీట్, ఇంజినీరింగ్ పరీక్ష మెటీరియల్ వంద మంది విద్యార్థులకు మంగళవారం ఉచితంగా అందజేశారు. సేవా సంస్థ చైర్మన్ పైడా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పైడా సంస్థ ద్వారా గతంలో ఆరు తరగతి గదులు నిర్మించామని, కళాశాల అభివృద్ధికి తమ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఐఈఓ గ్రంధి నూకరాజు, ప్రిన్సిపాల్స్ మూర్తిరాజు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటాం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పంచాయతీ కార్యదర్శులపై తప్పుడు ఫిర్యాదు చేసినట్లు వస్తున్న ఆరోపణలపై కాకినాడ డీఎల్‌పీఓ కార్యాలయ ఏఓ వెంకటరెడ్డిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ కార్యదర్శులకు హామీ ఇచ్చారు. కాకినాడ డివిజన్‌లోని పలువురు పంచాయతీ కార్యదర్శులపై అతనికి తెలిసిన వ్యక్తితో తప్పుడు ఫిర్యాదు చేసి మానసికంగా వేధిస్తున్నారని జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ నాయకులు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు తనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాలన్నారు. ఫిర్యాదు ఆధారంగా విషయాన్ని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి దృష్టికి తీసుకెళ్లి విచారణ అధికారి నివేదిక మేరకు చర్యలు ఉంటాయన్నారు. డీపీఓను కలిసిన వారిలో కార్యదర్శుల సంఘ జిల్లా అధ్యక్షుడు జొన్నాడ నరసింహారావు, కార్యదర్శులు పాండురంగారావు, కుమార్, శ్రీనివాసరావు ఉన్నారు.

శ్వాసకు అవరోధం న్యుమోనియా


వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు శేషగిరిరావు

బోట్‌క్లబ్: న్యుమోనియా అనేది బ్యాక్టీరియా, వైరల్, ఫంగల్ ఇన్ఫెక్షన్ వల్ల ఊపిరితిత్తుల్లో వాపు, ద్రవం చేరడం వల్ల సంభవిస్తుందని దీని వల్ల శ్వాస తీసుకోవడం కష్టమవుతుందని ప్రముఖ ఊపిరితిత్తుల నిపుణులు డి.శేషగిరిరావు అన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక భానుగుడి సెంటర్‌లోని సాయి ఊపిరితిత్తుల ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ వాయు కాలుష్యం పెరగడం వల్ల న్యుమోనియా కేసులు పెరుగుతున్నాయన్నారు. పారిశ్రామిక కాలుష్య కారకాలతో న్యుమోనియా మరణాలు పెరుగుతున్నాయన్నారు. అనంతరం రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు నాగేంద్ర, వీవీ గిరి, పద్మావతి, శైలజ, చైతన్య, సిరాజ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా పందుల స్వైర విహారం


శాంతినగర్‌లో జనావాసాల మధ్య తిరుగుతున్న పందులు

బోట్‌క్లబ్: కాకినాడ స్మార్ట్‌సిటీలో పందుల పెంపకంపై నిషేధం ఉన్నప్పటికీ పలు ప్రాంతాల్లో అవి స్వైర విహారం చేస్తున్నాయి. ఇంటి బయట డ్రైనేజీల్లోను, ఖాళీ ప్రదేశాల్లోను నిత్యం తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. స్థానిక శాంతినగర్‌లో అధికంగా పందులు తిరుగుతున్నాయని ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. దీనివల్ల అక్కడ దుర్వాస వెదజల్లుతోందన్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో దోమలతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఫిర్యాదు చేస్తే వెంటనే కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకునే వారని, ప్రస్తుతం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఈ ప్రాంత ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో పందులు తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థినికి సైకిల్ బహూకరణ

బోట్‌క్లబ్: స్థానిక 5వ డివిజన్‌లోని శ్రీనగర్ మున్సిపల్ స్కూల్‌లోని విద్యార్థికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ మంగళవారం సైకిల్ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు క్రీడా పరికరాలను అందించారు. స్కూల్ హెచ్‌ఎం అనురాధ పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ టోర్నీలో ఐడియల్ విద్యార్థుల ప్రతిభ


క్రీడలలో ప్రతిభ చూపిన విద్యార్థుల బృందం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఆదిత్య యూనివర్సిటీలో ఐదు జిల్లాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ఎ.మౌనిక (ఈసీఈ) విద్యార్థి 800, 1500 మీటర్ల ఈవెంట్‌లో పాల్గొని బంగారు పతకంతో పాటు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించిందన్నారు. అలాగే ఎన్ఎస్‌డీ ఐశ్వర్య, ఇ.స్నేహ, డి.శిరీష, ఎ.మౌనిక 400, 800 మీటర్ల విభాగంలో రజత, కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల బృందాన్ని కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, కరస్పాండెంట్ చిరంజీవినీకుమారి, డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ఏఓ జీవీకే వర్మ, పీడీ జి.కాశయ్య అభినందించారు.

కలుషిత వ్యర్థాల కొంగోడు


కరప తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కొంగోడు ఎస్సీ నాయకులు, మహిళలు

- అక్రమంగా రొయ్య, చేపల చెరువుల తవ్వకాలు
- వ్యర్థాలతో సమస్యపై ఎస్సీల ఆందోళన
- డిప్యూటీ తహసీల్దార్, కలెక్టర్లకు ఫిర్యాదు

కరప: నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల చెరువుల తవ్వకం పనులు చేపట్టినా పట్టించుకోని రెవెన్యూ అధికారుల తీరుకు కొంగోడు ఎస్సీ సామాజిక వర్గీయులు నిరసన వ్యక్తం చేశారు. రొయ్యల చెరువుల ద్వారా వదులుతున్న వ్యర్థాలతో తాగునీరు, బావులలోని నీరు కలుషితమవుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. రొయ్యల చెరువుల అక్రమ తవ్వకాలు ఆపకపోతే ఉద్యమిస్తామని ఆందోళనకారులు హెచ్చరించారు.

వివరాలు ఇలా ఉన్నాయి. కరప మండలం కొంగోడు గ్రామంలో ఎస్సీ వీధికి ఆనుకుని రొయ్యల చెరువులు ఉన్నాయి. ఆ వీధికి ఆనుకుని ఉండే ఇటుకల బట్టీని ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే రొయ్యల చెరువుల కోసం తవ్వకం పనులు చేపట్టారు. పాత చెరువుల వ్యర్థాలతో, దుర్వాసనతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కొత్తగా చెరువులు తవ్వవద్దని మాజీ సర్పంచ్ వింత అప్పారావు, సురేష్ తదితర ఎస్సీ సామాజికవర్గ పెద్దలు, మహిళలు చెప్పినా వినిపించుకోలేదు. ఆపడానికి మీరెవరంటూ జనసేన కార్యకర్త, చెరువుల యజమాని మేడిశెట్టి రామకృష్ణ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో మంగళవారం మూడు వ్యాన్లలో, మోటార్ సైకిళ్లపై ఎస్సీలు అందరూ ఏకమై కుటుంబ సభ్యులతో కలసి స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కొద్దిసేపు ధర్నాచేసి, చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలని, న్యాయం చేయాలని, మా ఆరోగ్యాలను కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అప్పారావు, సురేష్ తదితరులు మాట్లాడుతూ గతంలో రొయ్యల చెరువుల వల్ల కలిగే అనర్థాలు తెలియక, చెరువుల తవ్వకానికి అంగీకరించామన్నారు. సదరు చెరువుల వల్ల బావులు, బోర్లలోని నీరు ఉప్పునీరుగా మారిపోయాయన్నారు. చనిపోయిన రొయ్యల వల్ల దుర్వాసన భరించలేకపోతున్నామన్నారు. గాలి, నీరు కలుషితమవ్వడంతో తమ వీధి వారంతా శ్వాసకోస వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల వద్ద ఉండే జనరేటర్, ఏరియేటర్ల శబ్దాలతో రాత్రుళ్లు నిద్రపట్టడం లేదన్నారు. మళ్లీ కొత్తగా రొయ్యల చెరువుల తవ్వడం వల్ల మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అధికారులు స్పందించి రొయ్యల చెరువుల అక్రమతవ్వకాలను నిలిపివేయాలని, పాతచెరువులను కూడా పూర్తిగా తొలగించి న్యాయం చేయాలని ఎస్సీ నాయకులు, మహిళలు కోరారు.

తర్వాత కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి కొంగోడులో తవ్వుతున్న అనధికార రొయ్యల చెరువుల గురించి కలెక్టర్ షణ్మోహన్‌కు తమ బాధలను వినిపించారు. కలెక్టర్ స్పందించి అనుమతులు లేకుండా, ప్రజలకు ఇష్టం లేకపోయినా చెరువులు తవ్వుతుంటే మత్స్యశాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే కొంగోడులో చెరువుల తవ్వకం పనులు ఆపాలని అక్కడి అధికారులను ఆయన ఆదేశించారు. తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం ఆందోళనకారులు వెనుతిరిగారు.


కరపలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీలు


కొంగోడులో ఇటుకల బట్టీ స్థలంలో చేపట్టిన రొయ్యల చెరువుల తవ్వకం